



విలేకరులతో మాట్లాడుతున్న రాంభూపాల్

కార్పొరేట్లకు మేలు చేసేలా బడ్జెట్


14 నుంచి 20 వరకు నిరసనలు

సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వి.రాంభూపాల్

ప్రజాశక్తి-కదిరి అర్బన్

ఇటీవల కేంద్రం ప్రవేశపెట్టిన బడ్జెట్ కేవలం కార్పొరేట్లకు మేలు చేసేదిలా ఉందని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు వి.రాంభూపాల్ విమర్శించారు. పట్టణంలోని సిపిఎం కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బడ్జెట్‌లో ప్రజా సంక్షేమం ఎక్కడా లేదన్నారు. ముఖ్యమైన రంగాలకు నిధులు కేటాయించకపోవడంతో దేశ ప్రజలందరూ నష్టపోయే పరిస్థితి ఏర్పడిందన్నారు. ప్రజల కొనుగోలు శక్తి పెంచడానికి చర్యలు లేవన్నారు. నిరుద్యోగ సమస్య పరిష్కారంపై కేంద్రం ఎలాంటి స్పష్టతనూ ఇవ్వలేదన్నారు. ఆహార సబ్సిడీలు, వ్యవసాయం, విద్య, ఆరోగ్యం, సామాజిక సంక్షేమం తదితర వాటి కేటాయింపులు గతేడాదికి కంటే తగ్గించారన్నారు. ఉపాధి హామీ పథకానికి అదనంగా నిధులను కేటాయించాల్సి ఉండగా ఆ దిశగా కేటాయింపులు చేయకపోవడం విచారకరం అన్నారు. ధరల పెరుగుదల, జీఎస్టీ పెంపుతో ప్రజలపై మరింత భారాలను మోపిందన్నారు. బడ్జెట్‌లో చేసిన మోసాన్ని తెలియజేసేలా వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో ఈనెల 14 నుంచి 20వ తేదీ వరకు ఆందోళన కార్యక్రమాలు చేపడతామన్నారు. ప్రజా వ్యతిరేక బడ్జెట్‌ను ప్రజలందరూ వ్యతిరేకిస్తూ ఈ నిరసన కార్యక్రమాల్లో పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు జంగాలపల్లి పెద్దన్న, లక్ష్మీనారాయణ, జిఎల్.నరసింహులు, పట్టణ కమిటీ నాయకులు ముస్తాక్, బాబ్‌జాన్, జగన్, రామ్మోహన్, రఫీ, ఉదయ్, అంజి, అఖిల్ పాల్గొన్నారు.

జూన్‌లోపు నామినేటెడ్ పోస్టులు భర్తీ చేయనున్నట్టు ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు వెల్లడించారు. ఈ మేరకు మంగళవారం నాడు ఎమ్మెల్యేలు, ఎంపీలు, మంత్రులతో టెలీకాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడారు. ఈ సమయంలో ఆయన నామినేటెడ్ పోస్టుల భర్తీ అంశంపైనా మాట్లాడారు. జూన్ నెలలోపు నామినేటెడ్ పోస్టులు భర్తీ చేయనున్నట్టు చెప్పారు. పార్టీ కోసం పనిచేసిన వారిని గుర్తించాలని ప్రజాప్రతినిధులకు ఆయన సూచించారు.



జూన్‌లోపు నామినేటెడ్ భర్తీ..!

- ప్రజాప్రతినిధుల సమావేశంలో ముఖ్యమంత్రి
- పదవులపై ఆశావహుల ఎదురుచూపు
- దక్కించుకునేందుకు యత్నాలు

ప్రజాశక్తి -అనంతపురం ప్రతినిధి

ముఖ్యమంత్రి ప్రకటనతో ఆశావహుల్లో ఉత్సాహం నెలకొంది. సార్వత్రిక ఎన్నికల్లో ఉమ్మడి జిల్లాలో టిడిపి ఎప్పుడూలేని విధంగా అన్ని స్థానాల్లోనూ విజయం సాధించింది. దీనికితోడు ఈసారి కూటమి పార్టీలు ఉన్నాయి. టిడిపితోపాటు, బిజెపి, జనసేన పార్టీలూ ప్రభుత్వంలో భాగస్వాములుగా ఉన్నాయి. పదవుల్లో వీరికి పంపకాలు చేయాల్సి ఉంది. ఇప్పటికే అహుడా ఛైర్మన్ పదవిని జనసేనకు కేటాయించారు. ఆ పార్టీల నుంచి కూడా ఆశావహులు ఉండటంతో టిడిపి నేతల్లో నామినేటెడ్ పదవులు ఆశిస్తున్న వారిలో సందిగ్ధత నెలకొంది. తమకు పదవులు వస్తాయా.. లేదా అన్న గుబులు నెలకొంది. మొదటి మూడు పంపకాల్లో జిల్లాలో ముఖ్య నేతలకు ఆశించిన పెద్ద పదవులేవీ రాలేదు. ఇప్పుడు మార్కెట్‌యార్డు, దేవాలయాల ఆలయ కమిటీల్లో నైనా అవకాశాలు దక్కుతాయా లేదా అన్న సందేహాలు టిడిపి నాయకుల్లో కన్పిస్తున్నాయి. పదవుల కేటాయింపును త్వరగా తేలిస్తే బాగుంటుందన్న అభిప్రాయం ఆ పార్టీ నేతల నుంచి వ్యక్తమవుతోంది.

సహకార సంఘాలపైనా ఆశలు

నాయకులు నామినేటెడ్ పదవులే కాకుండా సహకార సంఘాలపైనా ఆశలు పెట్టుకున్నారు. ఈ సంఘాలకు ఎన్నికలు జరగక చాలాకాలమైంది. గత ప్రభుత్వం పర్సన్ ఇన్‌ఛార్జీలను పెట్టి వారితోనే సహకార సంఘాలను కొనసాగించింది. టిడిపి ప్రభుత్వం మాత్రం సహకార సంఘాల ఎన్నికలకూ కసరత్తును చేపట్టింది. సభ్యత్వాలను చేపడుతున్నారు. ఎన్నికలు నిర్వహించే అవకాశాలే అధికంగానున్నట్టు తెలుస్తోంది. ఎన్నికలు జరిగితే పార్టీ తరుపున పోటీ చేసేందుకు కొంత మంది సిద్ధమవుతున్నారు. ప్రతిపక్ష వైసిపి ఎన్నికల బరిపై పెద్దగా ఆసక్తి చూపే పరిస్థితులు కనిపించడం లేదు. ఇటీవల జరిగిన సాగునీటి సంఘాల ఎన్నికల్లోనూ ఇది స్పష్టంగా కనిపించింది. చాలా వరకు కూటమి మద్దతుదారులు ఏకగ్రీవం చేసుకున్నారు. అదే ఫార్ములా సహకార సంఘాల ఎన్నికలు జరిగినా అమలు జరుగుతుందని అధికార టిడిపి నేతలు భావిస్తున్నారు. ఏది ఏమైనా అన్ని నామినేటెడ్ పదవులనూ త్వరితగతిన భర్తీ చేయాలని టిడిపి నేతలు కోరుతున్నారు.

పెండింగ్ కేసులపై దృష్టి సారించండి

ఎస్పీ వి.రత్న



సమీక్షలో మాట్లాడుతున్న ఎస్పీ రత్న

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న కేసులను సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించి సత్వరమే పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని ఎస్పీ వి.రత్న ఆదేశించారు. జిల్లా పోలీస్ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్లో నెలవారి నేర సమీక్ష సమావేశాన్ని శనివారం నిర్వహించారు. జిల్లాలోని సబ్ డివిజన్ వారీగా డీఎస్పీలు, సిఐలతో పెండింగ్ కేసుల వివరాలను అడిగి వాటిపై సమీక్షించారు. గ్రేవ్, నాన్ గ్రేవ్, ఎస్సీ, ఎస్టీ, పోక్సో, హత్యలు, చోరీ వంటి కేసుల పరిష్కారంపై లోతుగా దర్యాప్తు చేయాలన్నారు. ఇప్పటికే ఆయా కేసుల్లో నిందితులుగా అరెస్ట్ అయిన కేసుల్లో త్వరిత ఛార్జిషీట్ దాఖలు చేసి, భాదితులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కేసుల పరిష్కారంలో సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించాలన్నారు. మహిళలు, బాలికల భద్రతపై ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులపై గౌరవంగా ప్రవర్తించాలని సూచించారు. సైబర్ నేరాలపై ప్రజలకు మరింత అవగాహన కల్పించాలన్నారు. జిల్లాలో గంజాయి, డ్రగ్స్, గ్యాంబ్లింగ్, మట్కాను పూర్తిగా నియంత్రించాలని ఆదేశించారు. క్రమం తప్పకుండా వాహనాల తనిఖీలు, బీట్స్, పెట్రోలింగ్ నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీలు విజయకుమార్, మహేష్, హేమంత్ కుమార్, ఆదినారాయణ ఎస్‌బి సిఐ బాలసుబ్రహ్మణ్యం రెడ్డి, డిసిఆర్‌బి సిఐ శ్రీనివాసులు, సైబర్ సెల్ సిఐ తిమ్మారెడ్డి, డిటిఆర్‌బి సిఐ సతీష్, ఐటి కోర్ ఇన్‌ఛార్జి సుదర్శన్ రెడ్డి పాల్గొన్నారు.



తిమ్మమ్మ మర్రిమాను ఆలయం వద్ద పూజలు చేస్తున్న జడ్జి

తిమ్మమ్మ మర్రిమానును సందర్శించిన జడ్జి

ప్రజాశక్తి-నంబులపూలకుంట

మండలంలోని ప్రపంచ ప్రసిద్ధిగాంచిన తిమ్మమ్మ మర్రిమానును శనివారం గుత్తి సీనియర్ సివిల్ జడ్జి కాశీవిశ్వనాథాచారి కుటుంబ సభ్యులతో కలిసి సందర్శించారు. ముందుగా జడ్జికి ఆలయ అర్చకులు, టూరిజం గైడ్ మనోహర్ స్వాగతం పలికి పూలమాలతో సత్కరించారు. అనంతరం జడ్జి తిమ్మమాంబ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. గైడ్ మనోహర్ తిమ్మమాంబ జీవిత చరిత్రను జడ్జికి వివరించారు.

సజావుగా నవోదయ ప్రవేశ పరీక్ష

ప్రజాశక్తి-లేపాక్షి

లేపాక్షి నవోదయ పాఠశాల, ఇంటర్ మీడియట్‌లో ప్రవేశం కోసం శనివారం లేపాక్షి, హిందూపురంలో నిర్వహించిన పరీక్షలు సజావుగా జరిగాయి. 9వ తరగతి ప్రవేశ పరీక్షకు 1084 మందికి గానూ 849 మంది హాజరయ్యారు. హిందూపురంలోని 4 సెంటర్లలో జరిగిన 11వ తరగతి ప్రవేశపరీక్షకు 1228 మందికి గానూ 919 మంది హాజరైనట్లు ప్రిన్సిపల్ నాగరాజు తెలిపారు. పరీక్షలను విజయవంతంగా నిర్వహించడంలో సహకరించిన జిల్లా విద్యాశాఖ, పోలీసు సిబ్బందికి ప్రిన్సిపల్ కృతజ్ఞతలు తెలిపారు.

14 నుంచి 'అనంత బాలోత్సవం'

- లలిత కళాపరిషత్‌లో మూడు రోజులపాటు పిల్లల పండుగ
- పోస్టర్ విడుదల చేసిన బాలోత్సవ కమిటీ



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న బాలోత్సవ కమిటీ నాయకులు

ప్రజాశక్తి-అనంతపురం

ఈనెల 14, 15, 16వ తేదీల్లో అనంతపురం నగరంలో 'అనంత బాలోత్సవం -5' నిర్వహించనున్నట్టు అనంత బాలోత్సవ కమిటీ వెల్లడించింది. ఈ మేరకు ఈ మూడు రోజుల కార్యక్రమాలకు సంబంధించిన పోస్టర్‌ను ఆహ్వాన కమిటీ విడుదల చేసింది. శనివారం ఉదయం స్థానిక క్రిసెంట్ స్కూల్‌లో కమిటీ అధ్యక్షురాలు ఎస్.షమీమ్ షఫివుల్లా ఆధ్వర్యంలో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె బాలోత్సవం నిర్వహణపై మీడియాతో మాట్లాడారు. పిల్లల్లో ఉన్న సృజనాత్మకతను వెలికితీసేందుకు ఏటా అనంతపురం నగరంలో అనంత బాలోత్సవాలు నిర్వహిస్తున్నట్టు చెప్పారు. ప్రస్తుతం ఐదవ సంవత్సరం ఈ ఉత్సవాన్ని నిర్వహించనున్నట్టు చెప్పారు. ఎప్పటిలాగా అనంతపురం ఆర్ట్స్ కళాశాల మైదానంలో కాకుండా ఈసారి లలిత కళాపరిషత్‌లో నిర్వహిస్తున్నామని తెలియజేశారు. ఈ విషయాన్ని పిల్లలు, పాఠశాల యజమాన్యాలు గుర్తించాలని సూచించారు. ఈనెల 14, 15, 16 తేదీల్లో ఉత్సవాలు పెద్దఎత్తున నిర్వహించేందుకు అవసరమైన ఏర్పాట్లు జరుగుతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు పెద్దఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కమిటీ సభ్యురాలు డాక్టర్ ప్రసూన మాట్లాడుతూ పిల్లల్లో చదువుల ఒత్తిడిని తగ్గించి, వారిలోనున్న ప్రతిభను వెలికితీసేందుకు బాలోత్సవాన్ని నిర్వహిస్తున్నట్టు వివరించారు. సాంస్కృతిక కార్యక్రమాలే కాకుండా పిల్లల్లో దేశభక్తి, సమైక్యతను చాటే విధంగా ఉండాలని కమిటీ భావిస్తోందన్నారు. మరో సభ్యురాలు వి.సావిత్రి మాట్లాడుతూ మూడు రోజుల పాటు జరిగే ఈ కార్యక్రమంలో వేలాది మంది విద్యార్థులు భాగస్వామ్యులవుతారని చెప్పారు. మొత్తం సాంస్కృతిక పోటీలతోపాటు, అకడమిక్ విభాగాల్లో వేరువేరు తరహాల్లో పోటీలు జరుగుతాయన్నారు. మూడు రోజుల పాటు జరిగే ఈ కార్యక్రమాలను పిల్లల సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమం విజయవంతం చేయడంలో అనేక మంది సహాయ సహకారాలు అందిస్తున్నారన్నారు. ఈ పిల్లల పండుగలో అందరూ పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు ఎజి.రాజమోహన్, చంద్రకళ, రామాంజినమ్మ, ఓతూరు పరమేష్, సురేష్ పాల్గొన్నారు.

రేషన్ బియ్యం తూకాల్లో చేతివాటం..!



చౌక దుకాణం ముందు నిరసన తెలుపుతున్న మహిళలు

ప్రజాశక్తి-హిందూపురం

పట్టణంలోని సిపిఐ కాలనీలో ఉన్న రేషన్‌షాపు డీలర్ బియ్యం తూకాల్లో చేతివాటం ప్రదర్శిస్తున్నారని రేషన్‌కార్డుదారులు పౌర సరఫరాల అధికారులకు ఫిర్యాదు చేశారు. పేదలను తూకాలోల మోసం చేస్తున్న రేషన్ డీలర్‌పై చర్యలు తీసుకోవాలని సిపిఐ నాయకులు వినోద్‌కుమార్ డిమాండ్ చేశారు. విషయం తెలుసుకున్న డిప్యూటీ తహశీల్దార్ హారతి రేషన్‌షాపును పరిశీలించి తక్కువ తూకాలు ఇవ్వడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మరోసారి పునరావృతమైతే దుకాణం సీజ్ చేస్తామని హెచ్చరించారు. దీనిపై డీలర్ బంధువు ఒకరు మాట్లాడుతూ తమకు స్టాక్ ఇచ్చే సమయంలో తక్కువగా బియ్యం వస్తున్నాయని, దీంతో తాము లబ్ధిదారులకు తక్కువగా తూకాలు వేయాల్సి వస్తోందని వాపోయారు. ఇదిలా ఉండగా చాలా రేషన్ షాపుల్లో తక్కువ తూకాలు వేస్తున్నారని లబ్ధిదారులు ఆవేదన వ్యక్తం చేశారు. మరోసారి ఇలాగే జరిగితే రెవెన్యూ కార్యాలయం ముందు ఆందోళనలు చేపడతామని సిపిఐ నాయకులు హెచ్చరించారు. కార్యక్రమంలో ఆసియాబాను, యాస్మిన్, అనూష, అస్మా, శాంతమ్మ, తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం

'పాంచజన్య'లో వంటల పోటీలు

ప్రజాశక్తి-హిందూపురం

పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని మున్సిపల్ ఛైర్మన్ రమేష్‌కుమార్ తెలిపారు. పట్టణంలోని పాంచజన్య పాఠశాలలో శనివారం పాఠశాల అధ్యక్షులు పాంచజన్య శ్రీనివాసులు ఆద్వర్యంలో శనివారం సాయంత్రం విద్యార్థుల తల్లిదండ్రులకు 'ఫటాఫట్ శుచి రుచి' పేరిట మంట లేని వంటల పోటీలు నిర్వహించారు. ఈ పోటీలను మున్సిపల్ ఛైర్మన్ డిఈ రమేష్‌కుమార్ భార్య రాధమ్మతో కలిసి ప్రారంభించినారు. పోటీల్లో 200 మంది వరకూ పాల్గొని, వివిధ రకాల వంటలను సిద్ధం చేశారు. న్యాయ నిర్ణేతలుగా డిప్యూటీ తహశీల్దార్ హారతి, రోటరీ క్లబ్ ఇన్నర్ వీల్ అధ్యక్షురాలు విద్య, వైద్యులు కీర్తి, మీనాక్షి హాజరై తినుబండారాలను పరిశీలించి విజేతలను ఎంపిక చేశారు. పాంచజన్య శ్రీనివాసులు మాట్లాడుతూ వంటింటికి పరిమితమవుతున్న మహిళలను ప్రోత్సహించాలని సంకల్పించి ఈ పోటీలు నిర్వహించామ న్నారు. తల్లులు తమ పిల్లలు సాయంత్రం ఇంటికి వచ్చిన సమయంలో బజారులో దొరికే రంగు రంగుల, అసహజ రుచికరమైన ఆహారాన్ని(జింక్ ఫుడ్) ఇస్తుంటారు. అందులో పోషక విలువలు లేని అధిక ఉప్పు, అధిక తీపి, అధిక కొవ్వు పదార్థాలు ఎక్కువగా ఉంటాయన్నారు. వీటిని తినడం వల్ల వయసు పైబడిన తర్వాత వచ్చే షుగర్, అధిక బ్లడ్ ప్రెషర్, గుండె, తదితర జబ్బులు చిన్న వయస్సులోనే వచ్చే అవకాశాలు ఉన్నాయన్నారు. సంప్రదాయ పద్ధతిలో ఇంట్లో వండి తినే ఆహారాన్ని వారి పిల్లలకు ఇస్తే సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారన్నారు. మున్సిపల్ ఛైర్మన్ రమేష్‌కుమార్ మాట్లాడుతూ పౌష్టికాహారాన్ని పరిచయం చేయడంతో పాటు మహిళలను ప్రోత్సహించేలా పాంచజన్య పాఠశాల యాజమాన్యం మంటలేని వంటల పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. సహజ సిద్ధంగా లభించే వస్తువులతో రుచికరమైన, ఆరోగ్యకరమైన తినుబండారాలను తయారుచేసి పిల్లలకు ఇవ్వడం వల్ల పిల్లల్లో ఎదుగుదలతో పాటు ఆరోగ్యంగా ఉంటారన్నారు. అనంతరం ఉత్తమ వంటలు చేసిన వారిలో మేఘన, రిజ్వాన, లిఖిత నజ్మా, సీమ, అలియాబాను మున్సిపల్ ఛైర్మన్ దంపతుల నుంచి బహుమతులు అందుకున్నారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ డిఎస్.నందకుమార్, హెచ్‌ఎం గాయత్రి, ఏఓ భాస్కర్, సూపరింటెండెంట్ విజయేంద్ర, ఏహెచ్‌ఎంలు శశికళ, సతీష్‌కుమార్, షేక్ అబ్దుల్ రజాక్, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.



వంటలను తయారు చేస్తున్న తల్లిదండ్రులు



బహుమతులు ఇస్తున్న ఛైర్మన్ రమేష్‌కుమార్, పాంచజన్య శ్రీనివాసులు

అంగన్వాడీ సమస్యలపై 17న ఆందోళనలు

యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.సుబ్బరావమ్మ

ప్రజాశక్తి పుట్టపర్తి రూరల్



రాష్ట్రపతికి పంపనున్న వినతపత్రాలను చూపుతున్న అంగన్‌వాడీ యూనియన్ నాయకులు

సమ్మె సందర్భంగా అంగన్‌వాడీలకు కూటమి నాయకులు ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరుతూ ఈ నెల 17న రాష్ట్ర వ్యాప్త ఆందోళనలు నిర్వహిస్తున్నట్లు అంగన్వాడీ వర్కర్లు, హెల్పర్ల యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.సుబ్బరావమ్మ పేర్కొన్నారు. శనివారం శ్రీ సత్యసాయి జిల్లా సిపిఎం కార్యాలయంలో అంగన్వాడీ వర్కర్స్ హెల్పర్స్ యూనియన్ జిల్లా కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సిఐటియు రాష్ట్ర నాయకులు జి.ఓబులు, జిల్లా ప్రధాన కార్యదర్శి ఈఎస్.వెంకటేష్, అంగన్‌వాడీ వర్కర్స్ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీదేవి, జిల్లా ఉపాధ్యక్షురాలు రంగమ్మ పాల్గొన్నారు. ఈ సందర్భంగా సుబ్బారావమ్మ విలేకరులతో మాట్లాడుతూ అంగన్వాడీ సమస్యల పరిష్కరిస్తామని ఎన్నికల సమయంలో టిడిపి నాయకులు హామీలిచ్చిరని, అధికారంలోకి వచ్చి ఏడు నెలలు అవుతున్నా దాని గురించి పట్టించుకోవడం లేదన్నారు. ఇటీవల కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్లో ఐసిడిఎస్‌కు నామమాత్రపు నిధులు కేటాయించి చేతులు దులుపుకున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అంగన్‌వాడీ సమస్యలను తెలియజేసేలా దేశవ్యాప్తంగా ప్రతి అంగనవాడీ కేంద్రం నుంచి రాష్ట్రపతికి వినతులు పంపుతున్నామని చెప్పారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం అంగన్వాడీలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి వేతనాలు పెంచాలన్నారు. గ్రాట్యుటీ అమలు చేసి, కార్యకర్తలను మూడవ తరగతి, హెల్పర్లను నాలుగో తరగతి ఉద్యోగులుగా గుర్తించాలని కోరారు. హెల్పర్లకు వర్కర్లుగా ఉద్యోగోన్నతి ఇవ్వాలని 2011లో ప్రభుత్వం జీవో ఇచ్చినా దానిని అమలు చేయలేదన్నారు. సత్యసాయి జిల్లాలో అంగన్‌వాడీలు, చిరుద్యోగులపై రాజకీయ వేధింపులు రోజురోజుకూ అధికం అవుతున్నాయన్నారు. అధికారులు ప్రజాప్రతినిధులు దీనిపై స్పందించి వేధింపులను నియంత్రించాలని కోరారు. సమస్యల పరిష్కారం కోరుతూ ఫిబ్రవరి 17న చేపట్టిన ఆందోళనల్లో అంగన్‌వాడీలు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి లక్ష్మీదేవి,ఉషారాణి, సుశీల, వాసంతి, మహదేవమ్మ, ధర్మవరం సరస్వతి, హిందూపురం అరుణ, శోభారాణి పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారమే 'ప్రజా గ్రీవెన్స్' లక్ష్యం : పల్లె

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్



పల్లె రఘునాథ్ రెడ్డి

ప్రజల సమస్యల పరిష్కారం కోసమే ప్రజా ఫిర్యాదుల వేదిక నిర్వహిస్తున్నామని మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్‌రెడ్డి తెలిపారు. పట్టణంలోని టిడిపి కార్యాలయంలో శనివారం నిర్వహించిన ప్రజా గ్రీవెన్స్‌కు ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి వ్యక్తిగత కారణాలతో హాజరు కాలేకపోవడంతో పల్లె రఘునాథ్‌రెడ్డి పాల్గొని ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ప్రజలు తాగునీరు, విద్యుత్, రోడ్లు, డ్రెయినేజీ, ఇళ్ల స్థలాలు, పట్టాలు, నూతన గహాలు, పింఛన్ల కోసం అర్జీలు ఇచ్చారు. భూ సమస్యలు అధికంగా వచ్చాయని పల్లె తెలిపారు. ఆయన మాట్లాడుతూ ప్రజల సమస్యల పరిష్కారం కోసం ప్రతి నెలా 15 రోజులకు ఓ సారి ప్రజా గ్రీవెన్స్ నిర్వహిస్తామని తెలిపారు. ప్రజలు విన్నవించిన సమస్యలను ఆయా శాఖల అధికారుల దృష్టికి తీసుకెళ్లి వేగవంతంగా పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. విద్యుత్ శాఖ అధికారులు నాణ్యమైన విద్యుత్, రైతులకు సకాలంలో ట్రాన్స్‌ఫార్మర్లు అందిం చాలని కోరారు. త్వరలోనే అర్హులందరికీ నూతన పింఛన్లు మంజూరయ్యేలా చూస్తామన్నారు. భూ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు విజయ్ కుమార్, మల్లిరెడ్డి, మైలె శంకర్, సామకోటి ఆదినారాయణ, రామారావు, మాజీ జడ్పిటిసి శ్రీరామ్ నాయక్, చెన్నకేశవులు, కేశవనాయుడు, శ్రీరామిరెడ్డి, ఆదినారాయణరెడ్డి, బొమ్మయ్య, పుల్లప్ప, నాగరాజు, సలాంఖాన్, తదితరులు పాల్గొన్నారు.

హోరాహోరీగా చెస్ టోర్నీ



కార్యక్రమంలో మాట్లాడుతున్న అసోసియేషన్ నాయకులు

ప్రజాశక్తి-ధర్మవరం టౌన్

యువర్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పట్టణంలోని కొత్తపేట రామ్‌నగర్‌లో ఉన్న శ్రీఉషోదయ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్‌లో ఏడవ స్టేట్ లెవెల్ ఓపెన్ చెస్ టోర్నమెంటు నిర్వహించినట్లు యువర్స్ ఫౌండేషన్ అధ్యక్షులు షీలా నాగేంద్ర, కార్య దర్శి జయరాం, కోశాధికారి వెంకటాద్రి మోహన్, పీఆర్వో రాధాకృష్ణ తెలిపారు. పట్టణంలో శనివారం వారు మాట్లాడుతూ ఈ నెల 7, 8వ తేదీల్లో నిర్వహించి చెస్ పోటీలు హోరాహోరీగా సాగాయ న్నారు. వివిధ జిల్లాల నుంచి మొత్తం 250 మంది చెస్ క్రీడాకారులు పాల్గొన్నారు. విజేతలకు మొత్తం రూ. 60 వేల విలువ చేసే ప్రైజ్, నగదు బహుమతులు అందజేస్తామన్నారు. క్రీడాకారులం దరికీ వసతి, భోజనం సౌకర్యం ఏర్పాటు చేశామన్నారు. ముఖ్య అతిథిగా ఏపీ స్టేట్ చెస్ అసోసియేషన్ కార్యదర్శి సుమన్, అధ్యక్షులు సత్యనారాయణ, టోర్నమెంట్ ప్రెసిడెంట్ డాక్టర్ బివి.సుబ్బారావు హాజరై చెస్ పోటీలను ప్రారంభించారు. వారు చెస్ పోటీల వల్ల కలిగే ప్రయోజనాలను క్రీడాకారులకు వివరించారు. ఏటా యువర్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో చెస్ పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో హాయ్ బ్రో చెస్ అకాడమీ అనంతపురం ఆర్గనైజింగ్ కార్యదర్శి జాకీర్ హుస్సేన్, జి.రమేష్‌బాబు, వైకె.శ్రీనివాసులు, పోలా ప్రభాకర్, కోటేశ్వరరావు, సుంకు సుకుమార్, బండ్లపల్లి రంగనాథ్, చాంద్‌బాషా పాల్గొన్నారు.

'పురం'లో కలగా మినీ స్టేడియం.!

బిల్లులు రాక పనులను ఆపేసిన కాంట్రాక్టర్ - ఆటకు దూరమవుతున్న క్రీడాకారులు

ప్రజాశక్తి-హిందూపురం

పట్టణంలో ఎంజిఎం మైదానంలో ఐదేళ్ల కిందట అప్పటి, ఇప్పటి ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ మినీ స్టేడియం నిర్మాణ పనులను ప్రారంభించారు. ఏళ్లు గడుస్తున్నా ఈ పనులు పూర్తవ్వలేదు. మినీ స్టేడియం క్రీడాకారులకు ఇప్పటికీ 'కల'గా మిగిలింది. సంబంధిత కాంట్రాక్టరుకు బిల్లులు రాకపోవడంతో ఈ పనులను ఆపేసినట్లు తెలుస్తోంది. హిందూపురం పట్టణంలోని ఎంజిఎం పాఠశాల క్రీడా మైదానంలో మినీ స్టేడియాన్ని నిర్మించేందుకు క్రీడా వికాస్ కేంద్రం (కెవిఆర్) ఆధ్వర్యంలో 2018లో రూ.2కోట్లతో మినీ స్టేడియం నిర్మాణ పనులను నందమూరి బాలకృష్ణ భూమిపూజ చేసి ప్రారంభించారు. పనుల పర్యేక్షణ భాధ్యతను సాంఘిక సంక్షేమ శాఖ ఇంజినీరింగ్ విభాగం అధికారులకు అప్పగించారు. గుత్తేదారులు కేటాయించిన స్థలంలో నిర్మాణ పనులు చకచకా మొదలు పెట్టారు. పనులు మొదలవ్వడంతో పట్టణవాసులు, క్రీడాకారులు హర్షం వ్యక్తం చేశారు. అంతా సవ్యంగా జరుగుతున్న సమయంలో 2019లో ప్రభుత్వం మారింది. దీంతో ఈ పనులకు సంబంధించిన బిల్లులు రాలేదు. బిల్లులు రాక కాంట్రాక్టర్ పనులను ఎక్కడికక్కడ ఆపేశాడు. ఇప్పటి వరకు గుత్తేదారులు సుమారు రూ.80లక్షలు సొంత డబ్బులు వెచ్చించి 40 శాతం పనులు పూర్తి చేశారు. ఇందుకు సంబంధించి ఆ సమయంలో రూ.40లక్షల పనులకు ఇంజినీరింగ్ అధికారులు ఎంబుక్ రికార్డు చేసేందుకు వివరాలు తీసుకున్నా తర్వాత ఆ వివరాలు నమోదు చేయలేదు. లక్షలు వెచ్చించి నిర్మాణ పనులు చేపట్టినా బిల్లులు మంజూరు కాక పోవడంతో గుత్తేదారులు గత్యంతరం లేక పనులను ఆపేశారు. దాదాపు ఐదు



అర్థాంతరంగా ఆగిన మినీ స్టేడియం

సంవత్సరాలుగా పనులు ఎక్కడివక్కడ ఆగిపోయాయి. నాటి నుంచి నేటి వరకు ఎంజిఎం మైదానంలో పనులు అసంపూర్తిగా ఉండడంతో మినీ స్టేడియం దిష్టి బొమ్మల దర్శనమిస్తున్నది. హిందూపురం ప్రాంతం నుంచి రాష్ట్ర స్థాయిలో ఖోఖో, కబడ్డీ, క్రికెట్, వాలీబాల్, షటిల్, బాల్ బ్యాడ్మింటన్, టెన్నిస్ క్రీడల్లో నైపుణ్యం గల క్రీడాకారులున్నారు. వారు సాధన చేసుకునేందుకు సరైన సౌకర్యాలు పట్టణం లేవు. మినీ స్టేడియం పూర్తయ్యి ఉంటే ఉదయం, సాయంత్రం సాధన చేసుకునేందుకు వీలుండేదని క్రీడాకారులు చెబుతున్నారు. ఈ స్టేడియంను ఎమ్మెల్యే బాలకృష్ణ ప్రారంభించిన సమయంలో టిడిపి అధికారంలో ఉంది. ఇప్పుడు మళ్లీ రాష్ట్రంలో టిడిపి అధికారంలోకి వచ్చింది. ఈ సమయంలో ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ ఈ పనులపై దృష్టి సారించి మినీ స్టేడియంను పూర్తి చేయించి అందుబాటులోకి తేవాలని క్రీడాకారులు కోరుతున్నారు.

బడ్జెట్‌లో ప్రాధాన్యత ఏదీ..!?

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

కేంద్ర ప్రభుత్వం ఈ వారంలో బడ్జెట్ను ప్రవేశపెట్టింది. ఈ బడ్జెట్‌లో జిల్లాకు ప్రాధాన్యత ఏ మాత్రమూ లభించలేదు. దేశంలోనే అత్యంత వెనుకబడిన ప్రాంతంగా అనంతపురం జిల్లా ఉంది. రాజస్థాన్‌లోని జైసల్మీర్ తరువాత అత్యల్ప వర్షపాతం నమోదయ్యే ప్రాంతం కూడా ఇదే. ఇటువంటి వెనుకబడిన ప్రాంతాలకు తగిన ప్రాధాన్యతనిచ్చి అభివృద్ధి పరుస్తామని విభజన సమయంలోనూ ప్రకటించారు. రాష్ట్ర విభజన జరిగి దశాబ్దకాలం పూర్తయ్యింది. అయినా ఇప్పటి వరకు జరిగిన పది బడ్జెట్ల్లోనూ చెప్పుకోదగిన ప్రాధాన్యత ఏదీ లభించలేదన్న అభిప్రాయం ప్రజల్లో ఉంది. ఒక్క కేంద్రీయ విశ్వవిద్యాలయం ఏర్పాటు వరకు జరిగింది. దానికి కూడా నిధుల కేటాయింపులు అరకొరగానే ఉంటూ వస్తున్నాయి. 2018లో దీని ప్రారంభం జెఎన్‌టియులోని ఇంక్యూబేషన్ కేంద్రంలో ప్రారంభించారు. ఆ తరువాత కార్యాలయం అక్కడే ఏర్పాటు చేసి క్యాంపస్‌ను బయట ప్రయివేటు ఇంజినీరింగు ఖాళీ భవన సముదాయంలో మార్చారు. ఇటీవలే దీన్ని సొంత స్థలంలోకి మార్పు చేశారు. అక్కడ ఇంకా పూర్తి స్థాయి మౌలిక సదుపాయాల కల్పన జరగలేదు. గడిచిన రెండేళ్లుగా ఈ విశ్వవిద్యాలయానికి నిధుల కేటాయింపుల్లేవు. అంతకు మునుపు భవన నిర్మాణానికి మంజూరు చేసిన రూ.112 కోట్లతోనే సర్దుబాటు చేసుకుంటూ వస్తున్నారు. ఇప్పటికీ శాశ్వత ఉద్యోగుల నియామకాలు పూర్తి స్థాయిలో జరగలేదు. పూర్తిస్థాయి విశ్వవిద్యాలయంగా ఏర్పాటైయ్యేందుకు ఎంత సమయం పడుతుందన్నది చూడాల్సి ఉంది. రాష్ట్ర విభజన సమయంలో వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి కేటాయిస్తామన్న నిధులేవీ లేవు. ఈసారి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినందున తగిన ప్రాధాన్యత లభిస్తుందని ఆశించారు. రాష్ట్రానికిగానీ, ఇటు వెనుకబడిన అనంతపురం జిల్లాకుగానీ పెద్దగా ఆశించిన ప్రయోజనం చేకూరలేదు. గుంతకల్లు డివిజన్‌కు కూడా ఆశించినంత నిధుల కేటాయింపుల్లేవన్న అసంతృప్తి సర్వత్రా వ్యక్తమవుతోంది.

ఈ వారంలో అనంతపురంలో ఉద్యానవన సమ్మేళనాన్ని ప్రభుత్వ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఉద్యానవనానికి ఊతమిస్తామని ప్రభుత్వం చెబుతూ ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. ఇప్పుడున్న ఉత్పత్తిని ఏడాదికి 25 శాతం చొప్పున పెంపుదల చేస్తామని కూడా ఈ సందర్భంగా కలెక్టర్ వినోద్ కుమార్ ప్రకటించారు. ఈ ఉత్పత్తి పెంపు దలకు ప్రభుత్వం ద్వారా ఏ రకమైన సహకారం అందుతుందన్నది మాత్రం ప్రకటించలేదు. ఇప్పటికీ ఉద్యానవన రైతులకు గిట్టుబాటు ధరలేదు. ఉద్యానవన పంటల్లో అత్యధికంగా ఉండే మిర్చి రైతు ఇప్పుడు ధరలేక అవస్థలు పడుతున్నారు. ఇటువంటి సమయంలో ప్రభుత్వం ద్వారా ఏ రకంగా సహకారం అందిస్తారన్నది ఈ కాంక్లేవ్‌లో లేదు. ఒకవైపు ఉద్యానవనానికి ఊతమిస్తామంటూనే మరోవైపు డ్రిప్ లక్ష్యాన్ని ప్రభుత్వం కుదించింది. జిల్లాలో అత్యధికంగా పండే టమోటా, మామిడికి ధరలేదని రైతులు గగ్గోలు పెడుతున్నారు. ఉద్యాన వన సమ్మేళనంలో మాత్రం అంతా బాగుందని చెప్పే ప్రయత్నం చేశారు. ఉద్యానవన పంటలకు ఏ రకంగా ఊతం ఇవ్వొచ్చు... మార్కెటింగ్‌పై ఏ రకంగా చర్యలు తీసుకుంటారన్న దానిపై స్పష్టత ఇవ్వలేదనే చెప్పాలి. కంపెనీలను మరింతగా ముందుకు తీసుకొచ్చి రైతులను వారికి అప్పగించే విధంగా ప్రభుత్వ తీరుందన్న విమర్శ వ్యక్తమవుతోంది. ఒక రకంగా కాంట్రాక్టు వ్యవసా యాన్ని పరోక్షంగా



ప్రోత్సహించే విధంగా ప్రభుత్వ వైఖరి కనిపిస్తోందని రైతు సంఘాల నాయకులు చెబుతున్నారు. కంపెనీలొచ్చి ముందుగానే రైతు ఏ రకమైన పంట పండించాలి... దానికి అవసరమైన ఇన్‌పుట్స్ కూడా ఇచ్చి వారే మార్కెటింగ్ చేసుకుంటారు. రైతుకు ఎంతోకొంత చేతిలో పెట్టి కంపెనీలు లాభాలు దండుకునే పరిస్థితి కనిపిస్తోంది. ఇది వరకే కాంట్రాక్టు వ్యవసాయం జిల్లాలో ప్రారంభించే ప్రయత్నాలు సాగాయి. గతంలో అరటి పంటను ఇదే రకంగా కంపెనీలకు ప్రభుత్వం రాయితీలిచ్చి ప్రోత్సహించింది. ప్రభుత్వ రాయితీలు పొందిన కంపెనీలు సరైన సమయంలో రైతుల నుంచి పంట కొనుగోలు చేయలేదు. దీంతో యల్లనూరు, పుట్లూరు మండలాల్లో అరటి రైతులు నష్టపోయారు. ఆ సమయంలో సమస్యను అధికారుల దృష్టికి రైతులు తీసుకొచ్చినా ప్రయోజనం లేకుండాపోయింది. ముందుగా కొంటామన్న ధరకు కంపెనీలు కొనుగోలు చేయకుండా చేతులెత్తేయడంతో రైతులు బయట అమ్ముకోవాల్సి వచ్చింది. నిర్దిష్టమైన ప్రణాళికతో రైతుకు ఉతమిచ్చే కార్యక్రమాన్ని ప్రభుత్వం తీసుకురావాలని రైతు సంఘాల నాయకులు సూచిస్తున్నారు.

ఎమ్మెల్యే కందికుంట ఆధ్వర్యంలో 'ప్రజాదర్బార్'

ప్రజాశక్తి-కదిరి అర్బన్

ప్రజల సమస్యలు తెలుసుకొని పరిష్కరించడమే ప్రజాదర్బార్ ఉద్దేశమని ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ తెలిపారు. పట్టణంలోని రోడ్లు భవనాల అతిథి గృహంలో శనివారం నిర్వహించిన ప్రజాదర్బార్ కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఆయన మాట్లాడు తూ రాష్ట్రవ్యాప్తంగా కూటమి ప్రజాప్రతినిధులు ప్రజలతో మమేకమై వారి సమస్యలు తెలుసుకొని అక్కడికక్కడే పరిష్కరించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. రాయచోటి-కదిరి రహదారిని అభివృద్ధి చేసి ప్రజలకు మెరుగైన ప్రయాణ సౌకర్యం కల్పించామన్నారు. తలుపుల మండలానికి ఎన్టీఆర్ సుజల స్రవంతి నీటిని తీసుకొచ్చామని, గాండ్లపెంట మండలానికి త్వరలోనే హంద్రీనీవా నీటిని తీసుకొచ్చేలా చర్యలు చేపడతామన్నారు. భవిష్యత్తులో కూడా ఎలాంటి సమస్యలు రాకుండా ప్రజలు లేఔట్‌లో మాత్రమే ప్లాట్‌లు కొనుగోలు చేయాలని సూచించారు.



ప్రజాదర్బార్‌లో వినతులు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే కందికుంట

పట్టణంలో విద్యుత్ సమస్యలు తలెత్తకుండా నూతన పరిజ్ఞానంతో విద్యుత్ సరఫరా చేసేలా ప్రణాళిక రూపొందిస్తున్నా మన్నారు. కూటమి ప్రభుత్వం అనతి కాలంలోనే చేసిన అభివృద్ధిని మాజీ సిఎం జగన్ కళ్లు ఉన్నా చూడలేకపోతున్నారని విమర్శించారు. సొంత చెల్లి షర్మిల ప్రశ్నలకు జగన్ సమాధానం చెప్పాలన్నారు. భవిష్యత్తులో రాష్ట్ర ప్రజలు వైసిపికి 11 స్థానాలు కాకుండా కేవలం 1 సీటు ఇచ్చే పరిస్థితి తెచ్చుకోవద్దని హితవు పలికారు. ఇకనైనా వైసిపి అధినేతతో పాటు నాయకులు రాష్ట్ర అభివృద్ధికి సహకరించాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్‌డిఒ వివి శర్మ, తహశీల్దార్ మురళీకృష్ణ, అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు హాజరయ్యారు.

ఉద్యోగావకాశాలు కల్పించాలని వినతి

కదిరి టౌన్ : నిరుద్యోగ యువతకు ఉద్యోగావకాశాలు కల్పించాలని కోరుతూ ప్రజాదర్బార్‌లో ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్‌కి వినతి పత్రం అందజేశారు. నియోజకవర్గంలో ఉన్నత చదువులు చదివిన యువత చాలా మంది ఉన్నారని, వారి కోసం పట్టణంలో పరిశ్రమలు ఏర్పాటు చేసి ఉద్యోగావకాశాలు కల్పించాలని వినతి పత్రం ఇచ్చారు. వినతి ఇచ్చిన వారిలో జనసేన పార్టీ కార్యకర్తలు గణేష్‌నాయక్, కృష్ణకాంత్, తదితరులు ఉన్నారు.

అనుకూలమైన ప్రదేశంలో గ్రీవెన్స్ నిర్వహించాలి

సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు ఈఎస్ వెంకటేష్

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

సమస్యలు పరిష్కారం అవుతాయని ప్రజలు ఎంతో ఆశతో గ్రీవెన్స్‌లో అర్జీలు ఇస్తున్నారని, వారి సమస్యలు పరిష్కారం చేయలేనప్పుడు గ్రీవెన్స్‌లు నిర్వహించడం ఎందుకని సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు ఈఎస్ వెంకటేష్ ప్రశ్నించారు. పట్టణంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు శనివారం టిడిపి కార్యాలయంలో ప్రజా సమస్యలపై గ్రీవెన్స్ నిర్వహించారన్నారు. అయితే టిడిపి కార్యాలయం పుట్టపర్తికి దూరంగా వ్యవసాయ క్షేత్రంలో ఉందన్నారు. నియోజకవర్గంలోని ఆరు మండలాల నుంచి ప్రజలు వ్యయ ప్రయాసలకు ఓర్చి పుట్టపర్తికి వస్తే టిడిపి కార్యాలయానికి చేరుకోవాలంటే మరో రెండు కిలోమీటర్లు నడవాల్సి ఉంటుందన్నారు. అంత దూరం ఉంటే సామాన్య ప్రజలు ఎలా



చేరుకుంటారని ప్రశ్నించారు. పుట్టపర్తిలోనే ఎక్కడో ఓ చోట నిర్వహిస్తే అందరికీ అనుకూలంగా ఉంటుందన్నారు. ఇకపై అయినా పట్టణంలో నిర్వహించాలని కోరారు. అలాగే ప్రతి సోమవారం జిల్లా కలెక్టరేట్‌కు ఎంతోమంది పేదలు ఇళ్ల స్థలాలు, భూమి తగాదాలపై ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో అర్జీలు ఇస్తున్నారన్నారు. ఒకే సమస్యపై కలెక్టరేట్‌లో పదిసార్లు అర్జీలు ఇచ్చిన సందర్భాలను మేము గమనిస్తున్నామన్నారు. ఇకనైనా ఎమ్మెల్యే అందరికీ అనుకూలమైన ప్రదేశంలో గ్రీవెన్స్ నిర్వహించాలన్నారు. కలెక్టర్ కూడా స్పందించి సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలని ఆయన కోరారు.

'ఉద్యోగం నుంచి తొలగించడానికే అక్రమ కేసు'

అంగన్వాడీ కార్యకర్త ఆవేదన

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

కక్ష సాధింపుతో తనపై అక్రమ కేసు బనాయించి ఉద్యోగం నుంచి తొలగించడానికి టిడిపి నాయకులు కుట్ర పన్నారని ఒడిసి మండలంలోని వీరప్పగారిపల్లి అంగన్వాడీ కార్యకర్త నాగమణి ఆవేదన వ్యక్తం చేశారు. బాధితురాలు శనివారం రాష్ట్ర అంగన్వాడీ వర్కర్స్ హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి సుబ్బరావమ్మను కలిసి మొర పెట్టుకుంది. ఆమె మాట్లాడుతూ రాజకీయ వేధింపులు భరించలేక గతంలో తాను పురుగుల మందు తాగానని, దీంతో కక్ష గట్టిన టిడిపి నాయకులు పోలీసులను మా ఇంటికి పంపి మా ఇంట్లో మద్యం లేకున్నా వారే మద్యం సీసాలు ఉంచి నన్ను అక్రమంగా కేసులో ఇరికించారని, భర్తతో పాటు తనపై దాడి చేశారని ఆవేదన వ్యక్తం చేసింది. ఒడిసి ఎస్ఐ చిత్రహింసలకు గురి చేశారని వాపోయింది. గ్రామంలో లేని సమయంలో మా ఇంటి వద్ద నోటీసులు అతికించి ఆ తర్వాత తొలగించారన్నారు. తాను మద్యం అమ్ముతున్నట్లు గ్రామానికి చెందిన



విలేకరులతో మాట్లాడుతున్న బాధితురాలు నాగమణి

టిడిపి నాయకులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారని, అందులో వాస్తవం లేదని తెలిపారు. స్పందించిన రాష్ట్ర కార్యదర్శి సుబ్బరావమ్మ అంగన్వాడీ కార్యకర్త దాడి ఘటనపై జిల్లా ఎస్పీకి ఫిర్యాదు చేయాలని జిల్లా కమిటీకి సూచించారు. ఆమెపై దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామని, ఆమెకు న్యాయం చేయకపోతే యూనియన్ ఆధ్వర్యంలో ఆందోళనలు నిర్వహిస్తామని హెచ్చరించారు.



ఖాద్రీశుని ఆలయంలో కిక్కిరిసిన భక్తజనం

ఖాద్రీశుని ఆలయానికి భక్తుల తాకిడి


ప్రజాశక్తి-కదిరి టౌన్

పట్టణంలో వెలసిన ఖాద్రీ నృసింహుని దర్శనానికి శనివారం భక్తులు పోటెత్తారు. స్వామి వారి దర్శనార్థం తెల్లవారుజాము నుంచే భక్తులు క్యులైన్‌లో బారులు తీరారు. ఉమ్మడి అనంతపురం జిల్లాతో పాటు కర్నాటకలోని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు అధికంగా తరలిరావడంతో ఆలయ ప్రాంగణం తో పాటు తీరుమాడ వీధులు క్కికిరిసిపోయాయి. భక్తులు స్వామి వారికి తలనీలాలు, తులభారం మొక్కుబడులు సమర్పించారు. ఆలయ అధికారులు భక్తుల సౌకర్యార్థం ప్రత్యేకంగా అతి శీఘ్రదర్శనం, ప్రత్యేక దర్శనం, ఉచిత దర్శనం క్యూలైన్లు ఏర్పాటుచేశారు.

మున్సిపల్ ఛైర్మన్‌కు సన్మానం

ప్రజాశక్తి-హిందూపురం

పట్టణంలోని నింకంపల్లిలో వెలసిన లక్ష్మీనరసింహస్వామి వినాయక యువజన సంఘం కమిటీ ఆధ్వర్యంలో శనివారం మున్సిపల్ నూతన ఛైర్మన్ డిఈ రమేష్‌కుమార్‌ను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కమిటీ గౌరవాధ్యక్షులు ఆదినారాయణ, రాయల్ గోపాల్, వాల్మీకి లోకేష్, టిడిపి నాయకులు శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు. అలాగే హిందూపురం హోల్ సేల్ క్లాత్ మర్చెంట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మున్సిపల్ ఛైర్మన్ రమేష్‌కుమార్‌ను కలిసి సన్మానించి, శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో అసోసియేషన్




మున్సిపల్ ఛైర్మన్ రమేష్‌కుమార్‌ను సన్మానిస్తున్న నాయకులు

అధ్యక్షులు కెకె.వెంకటేష్, కార్యదర్శి దాసా సందేష్, కోశాధికారి నితిన్, ఉపాధ్యక్షులు అశ్వర్థనారాయణ, భగీరథి నవీన్, మారుతి, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా భీష్మ ఏకాదశి

ప్రజాశక్తి-హిందూపురం

పట్టణంలో ప్రసిద్ధిగాంచిన పేట వెంకటరమణస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం భీష్మ ఏకాదశి ఘనంగా నిర్వహించారు. ఉదయం సుప్రభాతసేవతో పూజా కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. మూలవిరాట్ వెంకటరమణ స్వామిని వివిధ రకాల ఆభరణాలు, పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించారు. ఉత్సవ విగ్రహాలను ప్రత్యేకంగా అలంకరించి ప్రాకారోత్సవం నిర్వహించారు. మహా మంగళ హారతి అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.



ప్రాకారోత్సవంలో పాల్గొన్న భక్తులు

ఆగని కల్తీ కల్లు అమ్మకాలు

పరిగి : పరిగిలో లైసెన్స్ లేకుండా కల్లు విక్రయిస్తున్న దుకాణాన్ని ఇటీవల ఎక్సైజ్ అధికారులు సీజ్ చేశారు. అయితే సదరు కల్తీ కల్లు వ్యాపారి అధికారుల ఆదేశాలను బేఖాతరు చేస్తూ పరిగిలో మరో రెండు దుకాణాలను ప్రారంభించడం చర్చనీయాంశంగా మారింది. ఇటీవల ఎక్సైజ్ ఉన్నతాధికారులు పరిగిలో కల్తీ కల్లు కేంద్రాలపై దాడులు చేసి కేసు నమోదులు చేయడంతోపాటు కల్తీ కల్లును ధ్వంసం చేశారు. అయితే అదే వ్యాపారి మరో రెండు దుకాణాలను ప్రారంభించి కల్తీ కల్లు విక్రయిస్తుండడంపై ప్రజలు మండిపడుతున్నారు. ఈ విషయమై ఫోన్ ద్వారా సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసినా ఫలితం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

నీటి సమస్య పరిష్కారం

గోరంట్ల : సర్పంచి చొరవతో మండలంలోని మలసముద్రం పంచాయతీకి చెందిన పూలచెట్లపల్లి గ్రామంలో తాగునీటి సమస్య పరిష్కారమైంది. సర్పంచి సువర్ణఅశ్వత్థరెడ్డి శనివారం నూతనంగా పైపులైన్ వేయించి వాటర్ ప్లాంట్‌ను ఏర్పాటు చేయించారు. గ్రామంలో వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేయించడం పట్ల ప్రజలు హర్ష వ్యక్తం చేశారు. అలాగే గ్రామంలో మౌలిక వసతులు కల్పించేందుకు కృషి చేస్తామని సర్పంచి తెలిపారు.

జాతీయ స్థాయి రగ్బీ పోటీలకు రిత్వికశ్రీ

ప్రజాశక్తి-తాడిమర్రి

మండలంలోని ఎం.అగ్రహారం గ్రామానికి చెందిన కడపల శంకరయ్య కూతురు కడపల రిత్వికశ్రీ జాతీయ స్థాయి రబ్బీ పోటీలకు ఎంపికైంది. ఈమె ఈ నెల 11, 12, 13 తేదీల్లో మధ్యప్రదేశ్‌లోని గ్వాలియర్‌లో జరిగే నేషనల్ అండర్-15 విభాగంలో ఆంధ్రప్రదేశ్ రగ్బీ జట్టుకు ప్రాతినిధ్యం వహించ నుంది. రిత్వికశ్రీ ప్రస్తుతం అనంతపురంలోని సెయింట్ విన్సెంట్ డి పాల్ పాఠశాలలో 6వ తరగతి చదువుతోంది. రగ్బీ క్రీడలో మంచి ప్రతిభ ఉన్నా ఆర్థిక సమస్యల వల్ల ముందుకెళ్లలేని రిత్వికశ్రీకి ప్రభుత్వం సహాయ సహకారాలు అందించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. రిత్వికశ్రీ అతి చిన్న వయసులోనే రగ్బీ క్రీడలో ప్రతిభ చూపుతుండడంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.



టిడిపి కార్యకర్త మృతికి నివాళి

ప్రజాశక్తి-ముదిగుబ్బ

మండలంలోని రాఘవపల్లి గ్రామానికి చెందిన టిడిపి సీనియర్ కార్యకర్త యోగానంద శనివారం ఆకస్మికంగా మృతి చెందారు. ఆయన మృతి పట్ల ధర్మవరం నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి పరిటాల శ్రీరామ్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. అలాగే టిడిపి మండల నాయకులు ఆ గ్రామం వెళ్లి యోగానంద మృతదేహంపై టిడిపి జెండా కప్పి పూలమాల వేసి నివాళు లర్పించారు. కార్యక్రమంలో టిడిపి మండల కన్వీనర్ ప్రభాకర్‌నాయుడు, క్లస్టర్ ఇన్‌ఛార్జి తుమ్మల మనోహర్, కోట్ల బాబి, కార్యకర్తలు పాల్గొన్నారు



యోగానంద మృతదేహానికి నివాళు లర్పిస్తున్న నాయకులు

పరిశుభ్రతపై అవగాహన

ప్రజాశక్తి-ముదిగుబ్బ

స్థానిక బిసి బాలికల వసతి గృహాన్ని శనివారం పిహెచ్‌సి డాక్టర్ రాజేంద్ర సందర్శించారు. బాలికలకు వ్యక్తిగత పరిశుభ్రత, క్యాన్సర్, నులిపురుగుల నిర్మూలన, మంచి స్పర్శ, చెడ్డ స్పర్శ, బాల్య వివాహాలు, తదితర అంశాలపై అవగాహన కల్పించారు. డాక్టర్ రాజేంద్ర మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రత, మంచి ఆహారపు అలవాట్ల వల్ల ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చన్నారు. వారానికి ఓ సారి గోర్లు కత్తిరించుకోవడం, ప్రతిరోజూ స్నానం చేయడం, శుభ్రంగా ఉన్న దుస్తులు వేసుకోవడం, ప్రతి గురువారం తప్పని సరిగా ఐరన్ మాత్ర వేసుకోవడం, నులిపురుగుల నిర్మూలన కోసం ఆల్బెండజోల్ టాబ్లెట్ మింగడం, తదితర సూచనలు చేశారు. ఏవైనా ఆరోగ్య సమస్యలు కలిగినప్పుడు వెంటనే సమీప ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లి చికిత్స చేయించుకోవాలన్నారు.



బాలికలకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

అనంతరం పిల్లలకు వివిధ సమస్యలపై ఆరోగ్య పరీక్షలు చేసి మందులు ఇచ్చారు. హాస్టల్‌కు ఫస్ట్ ఎయిడ్ కిట్‌ను ఇచ్చారు. హాస్టల్‌లో భోజనాన్ని తిని పరిశీలించారు. కార్యక్రమంలో బిసి బాలికల హాస్టల్ వార్డెన్ సులోచనమ్మ, ముదిగుబ్బ హెల్త్ సూపర్వైజర్ విజయ్‌కుమారి, కమ్యూనిటీ ఆరోగ్య అధికారులు కావేరి, హృదయాంజలి, హెల్త్ అసిస్టెంట్ నాగరాజు, సచివాలయం హెల్త్ సెక్రటరీ శివమ్మ, ఆశా కార్యకర్తలు జయలక్ష్మి, అనురాధ, హాస్టల్, వైద్య, సిబ్బంది పాల్గొన్నారు.

ఇసుక టిప్పర్ పట్టివేత

ప్రజాశక్తి-బత్తలపల్లి

చిత్రావతి నది నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న టిప్పర్‌ను స్వాధీనం చేసుకున్నట్లు బత్తలపల్లి పోలీసులు తెలిపారు. ముదిగుబ్బ మండలంలోని ఉప్పలపాడు సమీపంలోని చిత్రావతి నది నుంచి శనివారం అక్రమంగా ఇసుక తరలిస్తున్నట్లు ఎఎస్ఐ సోమశేఖరమూర్తికి సమాచారం అందింది. దీంతో ఆయన పోలీస్ సిబ్బందితో కలిసి మండలంలోని పోట్లమర్రి గ్రామం వద్ద వాహనాల తనిఖీలు చేపట్టారు. ఆ సమయంలో అక్రమంగా ధర్మవరం పట్టణానికి ఇసుక తీసుకెళ్తున్న టిప్పర్‌ను స్వాధీనం చేసుకున్నారు. అలాగే టిప్పర్‌ను పోలీస్ స్టేషన్‌కు తరలించి, డ్రైవర్, ఓనర్‌పై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఎంతటి వారైనా అనుమతులు లేకుండా ఇసుకను అక్రమంగా రవాణా చేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

గుండె నొప్పికి ఉచిత ఇంజక్షన్

ప్రజాశక్తి-ధర్మవరం టౌన్

గుండెపోటుతో బాధ పడేవారికి రాష్ట్ర ప్రభుత్వం రూ. 45 వేల విలువ చేసే ఇంజక్షన్‌ను ఉచితంగా వేయించి వారి ప్రాణాలు కాపాడుతుందని ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ మాధవి తెలిపారు. పట్టణంలో శనివారం ఆమె మాట్లాడుతూ అధికంగా బీపీ, షుగర్ ఉన్నవారికి గుండెపోటు వచ్చే అవకాశం ఉందని తెలిపారు. ఛాతిలో నొప్పి, ఎడమ భుజం లాగడం, ఆకస్మికంగా ఆయాసం రావడం, గుండె దడ, స్పృహ కోల్పోవడం లాంటివి గుండెపోటు లక్షణాలు అని తెలిపారు. ఈ లక్షణాలు



ఉన్నప్పుడు మొదటి గంటలోపు ప్రభుత్వ ఆసుపత్రికి వస్తే వైద్య చికిత్స తో పాటు ఈ ఇంజక్షన్ వేయించుకుంటే ప్రాణాలు కాపాడవచ్చని తెలిపారు. ఇప్పటివరకూ ఈ ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రాథమిక పరీక్షలు నిర్వహించి మొదటి గంటలోనే టెనెట్ ప్లస్ ఇంజక్షన్ ఇచ్చి 24 మంది రోగుల ప్రాణాలు కాపాడామని తెలిపారు. ఈ ఇంజక్షన్‌పై రోగులకు ప్రతిరోజు అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. గుండెకు సంబంధించి ఎటువంటి సమస్య ఉన్నా ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రాథమిక చికిత్సతో పాటు భవిష్యత్తులో గుండెపోటు రాకుండా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

సిఐపై ఎస్పీకి ఫిర్యాదు

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

మడకశిర అప్‌గ్రేడ్ పోలీస్ స్టేషన్ సిఐ రాగిరి రామయ్యపై శనివారం ఓ గిరిజన మహిళ జిల్లా ఎస్పీ వి.రత్నకు ఫిర్యాదు చేసింది. ఆమె తెలిపిన వివరాలు.. తన బంధువుల కేసు విషయంలో న్యాయం కోసం పోలీస్ స్టేషన్‌కు వెళ్లగా సిఐ వ్యక్తిగత గదికి పిలిపించుకొని గంట పాటు వ్యక్తిగత సమాచారాలు అడిగారని, పదే పదే సమాచారం అడగడంతో భయాందోళన చెంది బంధువులకు తెలిపానన్నారు. వారు వచ్చి సిఐను నిలదీయడంతో తనను బయటకు పంపారని ఫిర్యాదులో పేర్కొన్నట్లు ఆమె తెలిపారు. తనతో అసభ్యంగా ప్రవర్తించిన సిఐపై చర్యలు తీసుకోవాలని కోరుతూ ఎస్పీకి ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. స్పందించిన ఎస్పీ పోలీస్ స్టేషన్‌లోని సీసీ కెమెరాలను పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు ఆమె తెలిపారు.

జాకీర్ హుస్సేన్‌కు నివాళి

ప్రజాశక్తి-ముదిగుబ్బ

భారత మాజీ రాష్ట్రపతి డాక్టర్ జాకీర్ హుస్సేన్ గొప్ప దార్శనికుడని ముస్లిం సంక్షేమ సంఘం నాయకులు కొనియాడారు. డాక్టర్ జాకీర్ హుస్సేన్ జయంతి సందర్భంగా శనివారం ముదిగుబ్బలో ముస్లిం సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. జాకీర్ హుస్సేన్ దేశానికి చేసిన సేవలను కొనియాడారు. జాకీర్‌హుస్సేన్ భారత స్వాతంత్ర్య సమరంలో పాల్గొనడంతో పాటు భారత మూడో రాష్ట్రపతిగా, ఉపరాష్ట్రపతిగా, గవర్నర్‌గా సేవలు అందించారన్నారు. అలీఘర్ ముస్లిం యూని వర్సిటీ స్థాపనలో కీలకపాత్ర పోషించారన్నారు. గొప్ప విద్యావేత్త అయిన ఆయన అలీఘర్ ముస్లిం యూనివర్సిటీతో పాటు జామియా మిలియా ఇస్లామియాకు వైస్ ఛాన్సలర్‌గా కూడా పని చేసి దేశ విద్యా



జాకీర్ హుస్సేన్‌కు నివాళులర్పిస్తున్న ముస్లిం నాయకులు

రంగంలో ఎన్నో కీలక మార్పులు తీసుకొచ్చారన్నారు. యువత ఆ మహానుభావుడి అడుగు జాడల్లో నడచి దేశానికి సేవలందించాలని కోరారు. కార్యక్రమంలో ముస్లిం సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఖలందర్, నాయకులు చింతపండు హైదర్‌వలి, అమీర్‌బాషా, సరితాల షబ్బీర్, ఇర్ఫాన్, యాసిన్, ముబారక్, ఇమ్రాన్, ముస్తాక్, బాబ్జాన్ పాల్గొన్నారు.

రుణాలకు దరఖాస్తు చేసుకోండి : మున్సిపల్ కమిషనర్

ప్రజాశక్తి-ధర్మవరం టౌన్

పట్టణంలోని మేదర, కుమ్మరి శాలివాహన కులాల ప్రజలు రుణాల కోసం 3 నుంచి ఐదుగురు సభ్యులు గ్రూపుగా ఏర్పడి ఈ నెల 12వ తేదీ లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ ప్రమోద్‌కుమార్ తెలిపారు. ఆయన మాట్లాడుతూ దారిద్ర్యరేఖకు దిగువన ఉండి, 21నుంచి 60ఏళ్ల లోపు వారు అర్హులన్నారు. దరఖాస్తు చేసిన తర్వాత కులం, బర్త్ సర్టిఫికెట్, రేషన్, ఆధార్ కార్డు, పాస్‌పోర్ట్ సైజ్ ఫొటో, బ్యాంకు పాస్ పుస్తకం, సెల్ నెంబర్ జత చేసి మున్సిపల్ కార్యాలయంలో అందజేయాలని తెలిపారు.

